క్లుప్తంగా

అంగన్‌వాడీలకు భవనాలు నిర్మించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణ తదితరులు

తలకొండపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించాలని గిరిజన ఐక్య వేదిక మండల కోఆర్డినేటర్ కొర్ర కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గిరిజన నాయకులతో కలిసి ఆయన ఎంపీడీఓ శ్రీకాంత్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని సూర్యానాయక్ తండా, లక్ష్మి తండాలలోని అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని కృష్ణ నాయక్ చెప్పారు. చిన్నారుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అంగన్‌వాడీ భవనాలకు అవసరమైన నిధులు మంజూరు చేసి నూతన భవనాలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కుమార్, నరసింహ, భాస్కర్, రవి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు ఆర్థిక తోడ్పాటు



హోంగార్డుకు ఆర్థికసాయం అందజేస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ హోంగార్డుకు అండగా తోటి పోలీసులు నిలిచారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ భార్య అనారోగ్యానికి గురైంది. ఈ విషయం తెలుసుకున్న తోటి పోలీసులు దాతృత్వం చాటుకున్నారు. అందరూ కలిసి ఆదుకున్నారు. రూ.56 వేల నగదు పోగుచేసి సీఐ సైదిరెడ్డి, ఎస్‌ఐలు మారయ్య, నాగరాజు, మైబెల్లి, రామకృష్ణ చేతుల మీదుగా ప్రవీణ్‌కు గురువారం అందజేశారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు



ఆమనగల్లులో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆమనగల్లు, కడ్తాల మండలాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 273 మంది విద్యార్థులకు గాను 263 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ వెంకటయ్య తెలిపారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులకు తాగునీటి వసతిని కల్పించి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

231 మంది హాజరు

మంచాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష గురువారం సజావుగా నిర్వహించారు. 237 మంది విద్యార్థులకు 231 మంది పరీక్షలకు హాజరయ్యారు. 6 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి వెంకట రమణారెడ్డి తెలిపారు.

సుందరీకరణ.. ఇదేం యాతన!

- శిలాఫలకానికే పరిమితమైన పనులు
- మురుగునీటిలో మగ్గుతున్న ఉప్పరాశికుంట
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కాలుష్య కోరల్లో ఉప్పరాశికుంట మగ్గుతోంది. సుందరీకరణకు చేపట్టిన పనులు శిలాఫలకలకే పరిమితం అయ్యాయి. దీనికితోడు కుంట భూములు ఆక్రమణకు గురవడంతో దాని ఉనికే ప్రశ్నార్థకంగా మారుతోంది.



మురికినీటితో నిండిన ఉప్పరాశికుంట చెరువు

కడ్తాల్: మండల కేంద్రంలోని నడి బొడ్డున శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన ఎఫ్‌టీఎల్ పరిధిలో విస్తరించి ఉన్న ఉప్పరాశికుంట కలుషితమవుతుంది. చెరువులో ఉన్న నీరు ముదురు ఆకుపచ్చ రంగుల్లోకి మారిపోతోంది. సర్వేనంబర్ 65లో 14.25 ఎకరాల కుంట విస్తరించి ఉంది. ప్రధాన రహదారిపై పడిన వర్షం నీరు నేరుగా ఉప్పరాశి కుంట చెరువులోకి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. దీనికితోడు అప్పట్లో రోడ్డు నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యర్థాలు సైతం కుంటలోకే వస్తోంది. దీంతో కుంటలో ఉన్న చేపలు మృత్యువాత పడి మత్స్యకారులకు తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఉప్పరాశికుంటను సుందరీకరణ చేస్తామన్న హామీలు కేవలం శిలాఫలకానికే పరిమితం అయ్యాయి.

దుర్గంధం వ్యాపిస్తోంది

చికెన్, మటన్ వ్యర్థాలు, మృతి చెందిన మూగజీవాల కళేబరాలను స్థానికులు గుట్టు చప్పుడు కాకుండా చెరువులోనే డంపు చేయడంతో కుంట పరిసరాలన్నీ దుర్గంధంతో నిండిపోయింది. చుట్టు పక్కల గృహస్తులు దుర్వాసనను భరించలేక పోతున్నారు. సమీపంలోనే కస్తూర్బా గాంధీ, బాలుర ఉన్నత పాఠశాలల విద్యార్థులు వాసన భరించలేక విలవిలలాడుతున్నారు. ఉప్పరాశి కుంట పరిసరాలతో పాటు, అన్మాస్‌పల్లి రహదారి పక్కన గతంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టి చెట్లు నాటించారు. కానీ రాత్రివేళల కొందరు చెత్తాచెదారాన్ని వేసి అపరిశుభ్రం చేస్తున్నారు. దీంతో అన్మాస్‌పల్లి, శాయిరెడ్డిగూడెం వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి మీదుగా వెళ్లే బాటసారులు, వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. కుంట సమీపంలోనే గ్రామ తాగునీటి అవసరాలకు కోసం బోరు పంపులు కూడా ఉన్నాయి.

ఆక్రమణల పర్వం

ప్రధానంగా ఉప్పరాశికుంటకు సంబంధించి శిఖం భూమి ఆక్రమణలకు గురి అవుతోందని గ్రామస్తులు అనేకసార్లు గ్రామ, మండల సభలో ఆరోపించారు. ప్రజల డిమాండ్ మేరకు సంబంధిత ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వే చేసినా కుంట హద్దులు సక్రమంగా నిర్ణయించలేదనే విమర్శలున్నాయి. ఇప్పటికే శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలు వెలిశాయని, నిబంధనలు పాటించకుండా ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో 10 నుంచి 12 ఫీట్ల వరకు ఉప్పరాశి కుంట కట్ట ఉండగా, సమీపంలో ఇళ్ల నిర్మాణాలకు మట్టి, ఇసుక, సిమెంట్ తదితర వాటిని తరలించే క్రమంలో 30 ఫీట్ల వెడల్పుకు చేరుకుంది. ఇలానే మట్టిని తీసుకువచ్చి వేస్తూ పోతే చెరువు ఉనికే ప్రమాదంలో పడే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉప్పరాశి కుంటను సుందరీకరణ పనులు చేపట్టి మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



కట్టపై మట్టి పోయడంతో కుంచించుకుపోతున్న కుంట

కుంటను ప్రక్షాళన చేయాలి

ఉప్పరాశికుంట ప్రక్షాళనకు అధికారులు చర్యలు చేపట్టాలి. మండల సర్వసభ్య సమావేశంలో కుంటను సుందరీకరణ చేయాలని కోరినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. చెరువు భూమి ఆక్రమణలకు గురికాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

– జహంగీర్‌బాబా, కో–ఆప్షన్ సభ్యుడు, కడ్తాల్

పార్కులు నిర్మించాలి

అసెంబ్లీ ఎన్నికల సమయంలో హడావుడిగా ఉప్పరాశికుంట సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. కానీ నేటికి పనులు పూర్తి కాలేదు. పట్టణ ప్రజలకు ఆహ్లాద వాతావరణం ఉండేందుకు కుంట సమీపంలో పార్కులను ఏర్పాటు చేయాలి.

– రాజేందర్‌గౌడ్, యువజన నాయకుడు, కడ్తాల్

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

సర్వే నంబర్ 65లో 14.25 ఎకరాల బఫర్ జోన్ పరిధిలో విస్తరించిన చెరువు ఆక్రమణలపై రెవెన్యూ శాఖకు సమాచారం అందించాం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఆక్రమణలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– నిఖిల, ఏఈ, మైనర్ ఇరిగేషన్

లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధిస్తాం

కాంగ్రెస్ పార్టీ నాయకుడు శెట్టిపల్లి సత్యం



ఆమనగల్లు: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు శెట్టిపల్లి సత్యం ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన కొనసాగుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో నాలుగింటిని అమలు చేశారన్నారు. పార్లమెంటు ఎన్నికలలోనూ కాంగ్రెస్ సత్తా చాటుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని జోస్యం చెప్పారు.

ఆలయాభివృద్ధికి సహకరించండి

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని ఇంజాపూర్‌లో చారిత్రాత్మకమైన బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ లేఖ రాశారు. అదే విధంగా ఆలయానికి సంబంధించిన 68.21 ఎకరాల భూమిని కాపాడేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం సాగుతుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలో భాగంగా ఇటీవల మరో రెండు హామీలను ప్రభుత్వం అమలు చేయడాన్ని స్వాగతిస్తూ గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల వరకు పెంచిందన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు గృహ అవసరాలకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బీక్యానాయక్, నర్సింహ, రాములుగౌడ్, లక్ష్మయ్య, మల్లేశ్‌గౌడ్, జహంగీర్‌అలీ, సత్యం, శంకర్, రాము, రామకృష్ణ, జవహర్, హీరాసింగ్, రాజేశ్, శ్రీకాంత్, ఇమ్రాన్, రవి, రమేశ్‌నాయక్, మణికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం సీఐ బదిలీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం సీఐ సైదిరెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సత్యనారాయణ రానున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సైదిరెడ్డిని బదిలీ చేసినట్లు తెలిసింది. పహాడీషరీఫ్‌లో డీఐగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణను ఇబ్రహీంపట్నం సీఐగా బదిలీ చేస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి గురువారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు.

గ్యారంటీలన్నీ అమలు చేస్తాం

కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి



తలకొండపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందని ఆ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేయమన్నారు. ప్రజా విశ్వాసం కాంగ్రెస్ వైపు ఉందని, దీంతో రాష్ట్రంలో అత్యధిక పార్లమెంట్ స్థానాలను హస్తం పార్టీ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కే మెజార్టీ స్థానాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఇబ్రహీంపట్నం రూరల్: చదువుతో పాటు విద్యార్థులకు ఆటలు అవసరమని గురునానక్ విద్యా సంస్థల ఎండీ డాక్టర్ హెచ్ఎస్ సైనీ అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థలో ఖేల్ మహోత్సవం–2024ను గురువారం నిర్వహించారు. ఇందులో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలతో పాటు 100 మీ, 200 మీ, 500 మీ అథ్లెటిక్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా హెచ్ఎస్ సైనీ మాట్లాడుతూ.. క్రీడల ద్వారా మానసిక, శారీరక దారుఢ్యం వస్తుందన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోహ్లి, డైరెక్టర్ వెంకటరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ పార్థసారథి, అసోసియేట్ డైరెక్టర్ రిషిసాయల్, హోమియోపతిక్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుక, డీఆర్ఆర్‌డీ డాక్టర్ రంగనాయకులు, డాక్టర్ సంజీవ్, ఈవెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ హరీష్‌కుంద్రాలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో వైస్ చైర్మన్ కోహ్లి

నేడు ఎమ్మెల్యేల ‘చలో లక్ష్మీదేవి పల్లి’



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

కొందుర్గు: లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు సందర్శిస్తారని జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ పాలమూరు, రంగారెడ్డి జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు అవసరాల కోసం లక్ష్మీదేవిపల్లి ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పి విస్మరించారన్నారు. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించే స్థలాన్ని పరిశీలించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు శుక్రవారం సందర్శించనున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు గౌడ్, అజ్జు, మక్సూద్, మల్లేశ్, జంగయ్య పాల్గొన్నారు.

ఉర్దూమీడియం పాఠశాలను అభివృద్ధి చేయాలి

కొత్తూరు: మండలంలో కొనసాగుతున్న ఉర్దూమీడియం పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలని మైనార్టీ సంఘం నాయకుడు లతీఫ్ గురువారం ఒక ప్రకటనలో విద్యాశాఖ అధికారులను కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలను స్వంత భవనానికి మార్చాలని పేర్కొన్నారు. ఇక్కడ తగినంత బోధన సిబ్బంది కూడా లేరని గుర్తు చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



గ్రామ కమిటీ మహిళలతో ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి

జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి పేర్కొన్నారు. గురువారం షాబాద్, కేశవగూడ గ్రామాల్లో కాంగ్రెస్ మహిళా గ్రామ కమిటీలను నియమించారు. చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఏబ్లాక్ అధ్యక్షురాలు పీసరి అనితారెడ్డి, షాబాద్ మాజీ సర్పంచ్ తమల్లి సుబ్రమణ్వేశ్వరిలతో కలిసి ఎనుకున్నారు. ఈ సందర్భంగా పామెన జ్యోతి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లోనూ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలన్నారు. చేవెళ్ల నుంచి కచ్చితంగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తారని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కట్టిన ప్రాజెక్టులు 40 ఏళ్లు దాటినా చెక్కు చెదరలేదని గుర్తు చేశారు. తెలంగాణ సాధించాక కట్టిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు నాగమణి, నాయకులు రవీందర్, రాములు, శివకుమార్, కృష్ణ, శ్రీను, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

కేశవగూడ మహిళ గ్రామ కమిటీ..

కేశవగూడ కాంగ్రెస్ మహిళ గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా బాలమణి, ఉపాధ్యక్షురాలు భారతమ్మ, ప్రధాన కార్యదర్శిగా సరస్వతి, కార్యదర్శులుగా నందిని, రత్నమ్మ, సహాయ కార్యదర్శులుగా బుచ్చమ్మ, అమృత, జయమ్మలను ఏకగ్రీవంగా ఎనుకున్నారు.

షాబాద్ గ్రామ కమిటీ..

షాబాద్ కాంగ్రెస్ మహిళా గ్రామ కమిటీ అధ్యక్షురాలుగా భాగ్యమ్మ, ఉపాధ్యక్షురాలుగా కవిత, కార్యదర్శులుగా రమాదేవి, సుగుణ, సహాయ కార్యదర్శిగా లలితలను ఏకగ్రీవంగా ఎనుకున్నారు.

ఆటకు వేళాయె!

క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువకులు వేసవి సెలవుల్లో ఆయా క్రీడల్లో శిక్షణ పొంది.. సత్తా చాటాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. అందుకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వేదికగా నిలుస్తోంది.. ఇక్కడ శిక్షణ పొందిన వారు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని స్టేడియం నిర్వాహకులు సూచిస్తున్నారు.

- వేసవి సెలవుల్లో శిక్షణకు సన్నద్ధం
- సరూర్‌నగర్ స్టేడియంలో ఏర్పాట్లు



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం

హుడాకాంప్లెక్స్: పాఠశాలలు, కాలేజీలకు మరికొద్ది రోజుల్లో వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. సెలవుల్లో విద్యార్థులు ఖాళీగా ఉండి, ఇంట్లో టీవీలకు, ఫోన్‌లకు అతుక్కుపోకుండా ప్రత్యేక అంశాల్లో శిక్షణ ఇప్పించాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. కొంతమంది సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి అంశాల్లో శిక్షణ ఇప్పించాలని భావిస్తుండగా, మరికొంత మంది ఇంగ్లిష్, హిందీ, ఫ్రెంచ్ భాషల్లో శిక్షణ ఇప్పించాలని భావిస్తున్నారు. మరికొంతమంది వివిధ క్రీడాంశాలను ఎంచుకుంటున్నారు. ఇలాంటి ఔత్సాహికులకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వేదికగా నిలుస్తోంది. ప్రతి ఏడాదిలాగే, ఈసారి కూడా ప్రత్యేక అంశాల్లో శిక్షణ ఇచ్చి విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. తద్వారా పిల్లలకు చదువుతో పాటు మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి, ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలని భావిస్తున్నారు. ఇప్పటికే స్టేడియం వేదికగా పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తమ సత్తాను చాటుకుంటున్నారు. తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన గురువులకు ఎనలేని గుర్తింపు తెచ్చిపెడుతున్నారు. ముఖ్యంగా స్కేటింగ్, అథ్లెటిక్స్, క్రికెట్, హాకీ, హ్యాండ్బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, టెన్నిస్, ఖోఖో, స్విమ్మింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. నిత్యం ఈ స్టేడియంలో 2500 మంది క్రీడాకారులు శిక్షణ తీసుకుంటున్నారు. వేసవి సెలవుల్లో వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశం లేక పోలేదు.. ఆ మేరకు స్పోర్ట్స్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడాకారుల నిష్పత్తిని బట్టి బ్యాచ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

సరూర్‌నగర్ స్టేడియంలో వివిధ అంశాల్లో ఇచ్చే శిక్షణ వివరాలు

క్రీడాంశం	కోచ్ పేరు	ఫోన్ నెం:
జిమ్నాస్టిక్స్	స్వర్ణలత	8148450218
బ్యాడ్మింటన్	ఫణికిషోర్	9866095912
వాలీబాల్	రమాదేవి	9000992041
క్రికెట్	రాజశేఖర్	9912114789
స్విమ్మింగ్	సంజయ్‌సింగ్	9700882801
టెన్నిస్	మధుసూదనాచారి	9666281961
స్కేటింగ్	యాదయ్య	9346662588
అథ్లెటిక్స్	సాయిబాబారెడ్డి	9703838987
బాస్కెట్‌బాల్	సైదులు	9908801432



కరాటే ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారిణి



జిమ్నాస్టిక్స్ ప్రాక్టీసు చేస్తున్న క్రీడాకారిణి

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో శిక్షణ..

విద్యార్థుల పరీక్షలకు అంతరాయం కలగకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఇస్తున్నాం. స్టేడియంలో అంతర్జాతీయ క్రీడా పరికరాలు, ప్రమాణాలతో శిక్షణ ఇస్తున్నాం. ఇక్కడ వేలాది మంది విద్యార్థులు, యువత శిక్షణ తీసుకుంటున్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడం విశేషం.

– వెంకటేశ్వర్‌రావు, డీఎస్‌డీఓ, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం

క్రీడాకారులకు ప్రయోజనం..



సరూర్‌నగర్ స్టేడియం క్రీడాకారులకు, వాకర్స్‌కు ఎంతో ప్రయోజనంగా ఉంది. ఈ స్టేడియంలో అన్ని రకాల క్రీడలకు నిపుణులైన కోచ్ లు ఉండడం, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. సరూర్‌నగర్ స్టేడియం జాతీయ పోటీల కు కేంద్రంగా మారడం గర్వంగా ఉంది.

– ఎం.రవికుమార్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి